సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం | 27 | సెప్టెంబర్ | 2025



కుల బహిష్కరణపై ఫిర్యాదు

పాలకోడేరు మండలంలోని పెన్నాడ అగ్రహారంలో సుమారు 28 మందిని కులం నుంచి వెలి వేసిన ఘటన వెలుగు చూసింది. 8లో ▸



పసిడి పరుగు

బంగారం ధరలు ఆల్‌టైం హై నమోదు చేసుకుంటూ దూసుకుపోతున్నాయి. దీంతో బంగారు ఆభరణాల అమ్మకాలపై ప్రభావం పడింది. 8లో ▸



లక్కవరం చోరీ కేసు ఛేదన

లక్కవరంలో ఇంటి తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడిన కేసును పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్ట్ చేశారు. 8లో ▸

అద్దె బస్సులకు టార్గెట్ భారం!

ఆర్టీసీ షాక్

- టార్గెట్ దాటితే యజమానులే డీజిల్ కొట్టించుకోవాలి
- గతంలో టార్గెట్ దాటినా డీజిల్ పోయించి తర్వాత బిల్లింగ్‌లో మినహాయిస్తూ వచ్చిన ఆర్టీసీ
- తాజాగా ఆ భారాన్ని యజమానులపై మోపే ప్రయత్నాలు
- వ్యతిరేకిస్తున్న హైర్ బస్సుల యజమానులు
- సామర్థ్యానికి మించి సిట్టింగ్‌తో మైలేజీ పడిపోతోందని ఆందోళన

సిద్ధాంతంకు చెందిన యజమాని ఆర్టీసీలో అద్దె (హైర్) ప్రాతిపదికన భీమవరం-రాజమహేంద్రవరం రూటులో బస్సు నడుపుతున్నారు. ఈ రెండు జిల్లా కేంద్రాల మధ్య దూరం 94 కిలోమీటర్లు కాగా రోజుకు నాలుగు సింగిల్ ట్రిప్పులు వేయాలి. లీటరుకు 5.6 కి.మీ మైలేజీ చొప్పున 364 కిలోమీటర్లకు ఆర్టీసీ 65 లీటర్ల డీజిల్ ఇస్తుంది. గతంలో ఈ డిజిల్ సరిపోగా ఇటీవల ఫ్రీ బస్సుతో ప్రయాణికుల రద్దీ పెరిగి ఓవర్‌లోడ్‌తో ఆయిల్ వినియోగం పెరిగిపోతోంది. రోజుకు 75 లీటర్ల వరకు ఆయిల్ ఖర్చవుతోంది. తనపై 10 లీటర్ల భారం పడుతోందని యజమాని వాపోతున్నారు.

సాక్షి, భీమవరం: ఉచిత బస్సు పథకం అద్దె (హైర్) బస్సుల యజమానులకు చుక్కలు చూపిస్తోంది. కాస్తోకూస్తో ఆదాయం వస్తుందనుకుంటే ఓవర్ లోడ్‌తో మైలేజీ పడిపోయి, మెయింటినెన్స్ పెరిగి ఇబ్బంది పడుతున్నారు. మైలేజీ షార్టేజ్ వస్తే డీజిల్ పోయించి తర్వాత బిల్లులో మినహాయించుకుంటూ వచ్చిన ఆర్టీసీ అధికారులు ఇప్పుడు టార్గెట్ దాటాకా డీజిల్ ఖర్చును తామే చెల్లించుకోమని చెబుతున్నారని యజమానులు వాపోతున్నారు. జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం ఆర్టీసీ డిపోల పరిధిలో వెన్నెల, ఇంద్ర, సూపర్‌లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు తదితర కేటగిరీల్లో 295 బస్సులు ఉన్నాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రభుత్వం పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు మాత్రమే పరిమితం చేసింది. ఈ సర్వీసులు జిల్లాలో 197 ఉండగా వీటిలో 40 శాతం అద్దె బస్సులే.



ప్రయాణికులతో రద్దీగా ఉన్న ఆర్టీసీ బస్సు (ఫైల్)

యజమానులపై డీజిల్ భారం

లీటరుకు 5.6 కి.మీ చొప్పున బస్సు తిరిగే రూటు, దూరం, వేసే ట్రిప్పులు (టార్గెట్) మేరకు హైర్ బస్సులకు ఆర్టీసీ డీజిల్ పోయిస్తుంది. మైలేజ్ షార్టేజ్‌తో అదనంగా డీజిల్ వినియోగమైతే ఆ భారాన్ని యజమానులే భరించాలి. టార్గెట్ పూర్తయ్యాక అదనపు డీజిల్‌ను ఆర్టీసీ బంకుల్లోనే పోసి ఆ మొత్తాన్ని యజమానులకు అద్దె చెల్లించే సమయంలో మినహాయించేవారు. ప్రస్తుతం బడ్జెట్ లేనందున టార్గెట్ పూర్తయితే ఎక్స్‌ట్రా డీజిల్ ఎప్పటికప్పుడు యజమానులే కొట్టించుకోవాలని అధికారులు సూచిస్తున్నట్టు యజమానులు చెబుతున్నారు. ఈ మేరకు ఎక్స్‌ట్రా డీజిల్ యజమానులే కొట్టించుకోవాలని భీమవరానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి చెప్పినట్టుగా ఉన్న ఆడియోను హైర్ బస్సు ఓనర్ ఒకరు సోషల్ మీడియా గ్రూపులో పోస్టు చేశారు.

ఓవర్ లోడ్ కష్టాలు

ఓవర్ లోడ్ వలన బస్సు కట్టలు విరిగిపోవడం, టైర్లు అరుగుదల తదితర రూపాల్లో నిర్వహణ భారం పెరిగిపోయిందని, బ్రేకులు సరిగా పడక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని యజమానులు ఆందోళన చెందుతున్నారు. మెయింటినెన్స్ కి.మీ రూ.13 నుంచి రూ.18కు పెంచాలని, అనుమతి మేరకు ప్రయాణికులను అనుమతించేందుకు ఆదేశాలివ్వాలని, రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా ప్రజారవాణ అధికారి వరప్రసాద్‌ను సంప్రదించగా అటువంటిది ఏమీ లేదని, ఎప్పటిమాదిరిగా టార్గెట్ పూర్తయ్యాక డీజిల్ ఆర్టీసీనే పోయించి బిల్లు నుంచి మినహాయించనున్నట్టు చెప్పారు.

జిల్లాలో ఉచిత బస్సు వివరాలు

సర్వీసులు	మొత్తం బస్సులు	వీటిలో హైర్ బస్సులు
ఎక్స్‌ప్రెస్	20	9
అల్ట్రా పల్లెవెలుగు	19	17
పల్లెవెలుగు	158	47

మైలేజీ తగ్గించాలి

ఎంఎస్‌ఎంఈలో లోన్‌పై బస్సు తీసుకుని ఆర్టీసీలో హైర్‌కు నడుపుతున్నాను. ఇప్పటికే తీవ్ర నష్టాల్లో ఉన్నాం. ఓవర్ లోడ్‌తో డీజిల్ షార్టేజీ వస్తోంది. ప్రస్తుతం ఉన్న మైలేజీని లీటరుకు 5.6 నుంచి 4.6కు తగ్గించాలి.

– రాపాక మహేష్, హైర్ బస్ ఓనర్, సిద్ధాంతం

తరచూ మరమ్మతులే..

బస్సులో 56 మందికు గాను 120 మంది వరకు ప్రయాణిస్తున్నారు. ఓవర్ లోడ్ వలన బస్సులు తరచూ మరమ్మతులతో మెయింటినెన్స్ పెరిగిపోయింది. బ్రేకులు సరిగా పడక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.

– ప్రశాంత్, హైర్ బస్ ఓనర్, మాధవరం

మైలేజీ తగ్గించకూడదనేనా ?

సాధారణంగా బస్ సిట్టింగ్ కెపాసిటీ 58 కాగా ప్రస్తుతం వంద మందికి పైనే ప్రయాణిస్తున్నట్టు ఓనర్లు చెబుతున్నారు. ఓవర్‌లోడ్ నేపథ్యంలో డీజిల్ వినియోగం పెరిగి రోజుకు ఎనిమిది నుంచి 15 లీటర్ల వరకు భారం పడుతోందంటున్నారు. మైలేజీని లీటరుకు 5.6 కి.మీ నుంచి 4.6 కి.మీ తగ్గించాలని కోరుతున్నారు. టార్గెట్ పూర్తయ్యాక ఆర్టీసీ అదనపు డీజిల్‌ను కొట్టిస్తే రికార్డుల్లో నమోదవుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ షార్టేజీని చూపించి హైర్ బస్ ఓనర్స్ అసోసియేషన్ మైలేజీ తగ్గించే విషయమై ఒత్తిడిని పెంచే అవకాశం ఉంది. ఆ పరిస్థితి రాకుండా ఆ భారాన్ని తమపై మోపాలన్న ఉద్దేశంలో అధికారులు ఉన్నారని యజమానులు అంటున్నారు. రోజూ మైలేజ్ షార్టేజీకి తాము సొమ్ములు ఎక్కడి నుంచి తీసుకురావాలని వాపోతున్నారు.

న్యూస్‌రీల్

విశాఖ ఉక్కును కాపాడుకోవాలి



మాట్లాడుతున్న బలరామ్

భీమవరం: విశాఖ ఉక్కును కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, అయితే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ పనులు ముమ్మరంగా జరుగుతుండటం దురదృష్టకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం భీమవరంలో చింతకాయల బాబూరావు అధ్యక్షతన జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చర్యలు తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం అన్యాయమని అన్నారు. పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదని మంత్రి లోకేష్ చెప్పడం ప్రజలను పక్కదారి పట్టించడమేనన్నారు. జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు అప్రోచ్ రోడ్లు వెంటనే నిర్మించాలన్నారు. టిడ్కో నివాస ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

ఫీజు బకాయిల కోసం గళమెత్తిన విద్యార్థులు

భీమవరం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, జీఓ 77 రద్దు చేయాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏబీవీపీ భీమవరం విభాగ్ కన్వీనర్ కాయిత డిన్ను చందు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హామీలిచ్చిన లోకేష్ అధికారం చేపట్టిన తర్వాత విస్మరించి విద్యార్థుల ఉసురు తీస్తున్నారన్నారు. వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేయాలని, జీఓ 77ను రద్దు చేయాలని, లేకుంటే లోకేష్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. భీమవరం పట్టణ కార్యదర్శి ఆర్.జగదీష్, మహిళ కన్వీనర్ సాయి భవాని, పట్టణ సహ కార్యదర్శి రోహిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్యా-పాట్యా జట్టు అ'ద్వితీయ'ం



ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా జట్టు

భీమవరం: రాష్ట్రస్థాయి సీనియర్ అట్యా-పాట్యా చాంపియన్‌షిప్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించిందని భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం స్కూల్ పీడీ జీపీసీ శేఖర్‌రాజు తెలిపారు. శుక్రవారం పల్నాడు జిల్లా నకిరేకల్‌లో జరిగిన పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ చూపి రెండో స్థానంలో నిలిచిందన్నారు.

క్షేత్ర రహదారికి మరమ్మతులు



గొల్లగూడెం వద్ద రహదారిపై ఉన్న గుంతలో మెటల్ డస్ట్ వేస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

ద్వారకాతిరుమల: భీమడోలు–ద్వారకాతిరుమల ప్రధాన రహదారి అధ్వానంగా ఉండటంపై శుక్రవారం 'సాక్షి'లో ప్రచురించిన 'ఆదమరిస్తే.. ప్రాణాలు గోవిందా!' కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఉదయం ఆర్అండ్‌బీ అధికారులు పంగిడిగూడెం, సూర్యచంద్రరావుపేట, గొల్లగూడెం, ద్వారకాతిరుమలలో రహదారిపై ఉన్న గుంతలను పరిశీలించారు. వెంటనే పొక్లయిన్‌తో మెటల్ డస్ట్ వేయించి గుంతలను పూడ్చించారు. అయితే తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన ప్రాంతాల్లో తరచూ రోడ్డు దెబ్బతింటోందని, సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పెరుగుతున్న గోదావరి వరద

పోలవరం రూరల్: గోదావరి వరద పెరుగుతూ శుక్రవారం రాత్రికి పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 31.530 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు 7.63 లక్షల క్యూసెక్కుల వరదనీరు చేరుతోంది. ఎగువన భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. భద్రాచలం వద్ద 44.70 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. అల్పపీడన ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కొండవాగుల నీరు నదిలోకి చేరడంతో వరద ప్రవాహం పెరుగుతోంది.

వచ్చేనెలలో పెన్షన్ అదాలత్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో వచ్చేనెల 9, 10వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ వారిచే పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. జిల్లా ఖజానా, ఖాతాల అధికారి ఆడారి గణేష్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యాలయాలు నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ, రాష్ట్ర ఖజానా, లెక్కల అధికారి డా.నేతల మోహన రావు, అకౌంటెంట్ జనరల్, ఖజానా శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. చాలా ఏళ్లుగా జిల్లాలోని వివిధ శాఖల డీడీఓల వద్ద అపరిష్కృతంగా ఉన్న పెన్షన్, జీపీఎఫ్, రికన్సిలేషన్, మిస్సింగ్ క్రెడిట్స్, డెబిట్స్, ఏజీ పెండింగ్ పేరాల సమస్యలను పరిష్కరిస్తారన్నారు.

జీఎస్టీపై అవగాహన కల్పించాలి

జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై నెల రోజుల కార్యక్రమాలు, సీజనల్ కండీషన్లు, పీఎం సూర్య ఘర్, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు, సోలార్, విండ్ ప్రాజెక్టులకు భూ సంబంధిత అంశాలపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి హాజరయ్యారు.

● శ్రీ మహాలక్ష్మీ నమోస్తుతే



శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. జంగారెడ్డిగూడెం గ్రామదేవత గంగానమ్మ ఆలయంలో రూ.3 కోట్ల కరెన్సీ నోట్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. – జంగారెడ్డిగూడెం

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి

కాళ్ల: ప్రతి కార్యకర్తకూ డిజిటల్ బుక్ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పెదఅమిరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం డిజిటల్ బుక్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్తకూ వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ భరోసా ఇస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ, ఎవరికి ఏ అన్యాయం జరిగినా ఈ డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తామన్నారు.

ప్రతిఒక్కరినీ గుర్తించుకుంటామని, అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలతో ప్రతి కార్యకర్తకూ న్యాయం జరిగేలా చర్యలు తీసు కుంటున్నారన్నారు. అధికారం వచ్చిన తర్వాత కార్యకర్తల ద్వారానే పాలన సాగించేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు వల్లే వైఎస్సార్‌సీపీ బలంగా ఉందన్నారు. 40 శాతం ఓట్లతో బలంగా నిలబడ్డామంటే అది కార్యకర్తల బలమే అని, అందుకే పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని అధినేత మాట ఇచ్చారన్నారు. ప్రతి గ్రామంలో అనుబంధం కమిటీలు రైతు, మహిళా, యూత్, స్టూడెంట్, బీసీ ఎస్సీ, సోషల్ మీడియా కమిటీలను నియమించాలన్నారు. ఉండి, భీమవరం నియోజకవర్గల ఇన్‌చార్జ్‌లు పీవీఎల్ నరసింహరాజు, చినమిల్లి వెంకటరాయుడు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల నాయకులు, నియోజవర్గ స్థాయి నాయకులు పాల్గొన్నారు.



డిజిటల్ బుక్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు, సమన్వయకర్తలు పీవీఎల్, చినమిల్లి

బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలపై నిరసన

భీమవరం: అసెంబ్లీ సాక్షిగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. యూత్ వింగ్ జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్ మాట్లాడుతూ బాలకృష్ణ మాట్లాడిన మాటలు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉన్నాయన్నారు. జగన్‌పై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలకు తక్షణం క్షమాపణ చెప్పాలని, లేకుంటే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. యూత్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడు దాయం ప్రకాష్, భీమవరం మండల యూత్ అధ్యక్షుడు బేతాళ సంతోష్ మాట్లాడుతూ అసెంబ్లీ నిర్వహణ చూస్తుంటే రాష్ట్ర ప్రజలు తీవ్ర కలత చెందుతున్నారని, ప్రజాసమస్యలను పక్కన పెట్టి వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ సంక్షేమ పథకాలతో పేదల పక్షపాతిగా ఉంటే, ప్రస్తుత కూటమి పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్టీ నాయకులు గుంటి ప్రభు, వీరవల్లి ప్రవీణ్, పతివాడ శేషు, స్టాలిన్, పాలపర్తి అర్జున్, బుంగా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ నాయకులు

మళ్లీ వణికిస్తున్న గోదావరి వరద

వేలేరుపాడు: గోదావరి వరద మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీతో మండలంలోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మూడు నెలల్లో గోదావరిలో నీటి మట్టం పెరగడం ఇది ఆరోసారి. దీంతో మండలంలోని 26 గ్రామాలు మరోసారి జలదిగ్బంధనంలోకి వెళ్లాయి. మూడు నెలలుగా ఆయా గ్రామాలను వరద నీరు వీడటం లేదు. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే రహదారిలో మేళ్లవాగు, ఎద్దెలవాగు, టేకూరు, తదితర వాగుల వంతెనలు నీటమునిగాయి. దిగువనున్న కొయిదా, కాచారం, పేరంటపల్లి, టేకుపల్లి, తాళ్లగొంది, పూసుగొంది, టేకూరు, కట్కూరు, సిద్దారం, ఎడవల్లి, చిట్టంరెడ్డిపాలెం, ఎర్రతోగు, చిగురుమామిడి, బోళ్లపల్లి, పాతనార్లవరం, తూర్పుమెట్ట, కొత్తూరు తదితర గ్రామాలతోపాటు మరో తొమ్మిది గ్రామాలు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. రుద్రమకోట వెళ్లే రహదారి నీటి మునగడంతో ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు.



ఎద్దెలవాగు వద్ద పడవపై ప్రయాణిస్తున్న గిరిజనులు

కుక్కునూరు మండలంలో..

కుక్కునూరు: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరిలో వరద ఉధృతి పెరిగింది. మండలంలోని పంట చేలల్లోకి వరద నీరు ప్రవేశించింది. కాగా మండలంలోని వరద పునరావాస సహాయక కేంద్రాల్లో తలదాచుకుంటున్న నిర్వాసితులు ఇటీవల వరద తగ్గడంతో తమ ఇళ్లకు చేరారు. మరలా వరద పెరగడంతో ఆందోళన చెందుతున్నారు.

ఉద్యోగులకు మొండిచేయి

- పెండింగ్‌లో నాలుగు డీఏలు
- దసరాకూ మంజూరు కాని వైనం!
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 67 వేల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు

ఏలూరు(మెట్రో): కూటమి సర్కారు తీరుతో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరించకపోవడంతో పాటు ఒక్క డీఏ కూడా మంజూరు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నరకు చేరుతున్నా ఇప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించకపోవడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సమస్యల పరిష్కారం, డీఏల మంజూరుపై ఇప్పటికే పలురకాలుగా నిరసనలు తెలుపుతున్నా సర్కారు పట్టించుకోవడం లేదు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ఆందోళన బాట పట్టగా ఏపీ రెవెన్యూ అసోసియేషన్ సైతం ఉద్యమ ఆలోచనలో ఉంది. 2024 జనవరి నుంచి ఇప్పటివరకూ నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, దసరా సందర్భంగా ఒక్క డీఏ కూడా మంజూరు చేయకపోవడం దారుణమని ఉద్యోగులు అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో రూ.4 వేల కోట్ల బకాయిలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 67 వేలకుపైగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉన్నారు. ఏలూరు జిల్లాలో 38 వేలు, పశ్చిమగోదావరి జిల్లా 29 వేల మంది పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో వారికి ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాలనను వికేంద్రీకరణ చేసి ఉద్యోగులకు ఒత్తిడి లేకుండా, అదే సమయంలో వారికి అందాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందించేందుకు కృషి చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే మాజీ సీఎం జగన్ 27 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) అందజేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల కోసం 12వ పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. పీఆర్‌సీ కమిషన్ సేవలు ప్రారంభించే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో కమిషన్ ఆగిపోయింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పనిభారం పెంచడంతో పాటు తమను పట్టించుకోవడం లేదనే భావన ఉద్యోగుల్లో ఉంది. ఉమ్మడి జిల్లాలో ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.4 వేల కోట్ల వరకూ ఉన్నాయి. 2024 జనవరిలో 3.64 శాతం, 2024 జూలైలో 2.73 శాతం, 2025 జనవరిలో 1.82 శాతం, 2025 జూలైలో 2.73 శాతం మొత్తంగా 10.92 శాతం డీఏ బకాయిలు ఉన్నాయి.



ఏలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

శోచనీయం



జిల్లాలో వేలాది మంది ఉద్యోగులు కూటమి సర్కారు తీరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం అవేమీ పట్టనట్లు ప్రభుత్వం ప్రవర్తిస్తోంది. దసరా పండగకైనా డీఏలు ప్రకటిస్తారని ఎదురుచూశాం. కానీ అదేమీ లేదు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఒక్క డీఏ అయినా ప్రకటించాలి.

– కె.రమేష్‌కుమార్, జిల్లా రెవెన్యూ శాఖ అధ్యక్షుడు, ఏలూరు

ఉద్యోగుల సమస్యలు

- ఏపీజీఎల్‌ఐ లోన్, ఫైనల్ పేమెంట్లు పూర్తిగా నిలిచిపోయాయి.
- మూడు సరెండర్ లీవ్‌లు పెండింగ్.
- పది నెలల ఎన్‌క్యాష్‌మెంట్ ఆఫ్ లీవ్‌ల పెండింగ్
- ముందుకు కదలని 12వ పీఆర్‌సీ
- 10 నెలల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల పెండింగ్
- 2024 అక్టోబర్ నుంచి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యూటీ బకాయిలు
- డీఏ, పీఆర్‌సీ బకాయిల పెండింగ్
- ఐఆర్ ఊసెత్తని ప్రభుత్వం

పండగల వేళ.. పసిడి పరుగు

- రూ.11 వేలు దాటిన గ్రాము ధర
- వెండిదీ.. అదే జోరు
- తగ్గిన అమ్మకాలు
- ఉమ్మడి పశ్చిమలో రోజుకు రూ.2 కోట్లకుపైనే అమ్మకాలు డౌన్
- అన్ని పట్టణాల్లో పాత బంగారం మార్పిడి జోష్


గోల్డ్ వస్తువులు


నరసాపురంలో ఓ జ్యూయలరీ షాపు

నరసాపురం: బంగారం ధరలు ప్రతిరోజూ ఆల్‌టైం హై నమోదు చేసుకుంటూ దూసుకుపోతున్నాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ.11 వేలు దాటింది. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా రూ.10 వేలు దాటేసింది. ప్రస్తుతం అంతర్జాతీయంగా బులియన్ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు, మరోవైపు షేర్ మార్కెట్ ఒడిదుడుకులు, ఇంకో వైపు ట్రంప్ సుంకాల బాదుడు, రూపాయిలో డాలర్ మారకం విలువ రూ.100కు చేరువుగా ఉండడం వంటి కారణాల నేపథ్యంలో ఇప్పట్లో ధరలు పెరగడమే కానీ, తగ్గేది ఉండదనేది బులియన్ ట్రేడ్ వర్గాల అంచనా వేస్తున్నారు. అందనంత ఎత్తుకు చేరుకున్న బంగారం ధరల ఎఫెక్ట్ అమ్మకాలపై పడింది. పెళ్లిళ్ల వంటి సామాజిక అవసరాల కోసం బంగారం కొనుగోలు చేయాలనుకునే మధ్య తరగతి వారు బంగారం ధరలు చూసి కనీసం గోల్డ్ షాపుల మెట్లెక్కాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది. శుక్రవారం నరసాపురం బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,16,910 వద్ద ట్రేడయ్యింది. 22 క్యారెట్ల 916 కేడీఎం బంగారం ధర రూ. 1,05,500కు చేరింది. అంటే కాసు ఆభరణాల బంగారం ధర రూ.84,400. కాసు బంగారు వస్తువులు చేయించుకోవాలంటే తరుగు, మజూరులను కలుపుకుంటే రూ 90 వేల కంటే పెట్టాలి.

పండగల విక్రయాలపై ప్రభావం

దసరా, దీపావళి పండగల రోజుల్లో బంగారం విక్రయాలు జోరుగా సాగుతాయి.

ఇక క్రిస్మస్, సంక్రాంతి పండగలు కూడా సమీపానే ఉన్నాయి. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కూడా మొదలైంది. అయితే బంగారం ధరల పెరుగుదల బంగారం అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపింది. వరుస పండగలు, పెళ్లిళ్ల సీజన్‌లో కళకళలాడాల్సిన జ్యూయలరీ షాపులు ఉమ్మడి పశ్చిమలో వెలవెలబోతున్నాయి. గోదావరి జిల్లాలోనే అతిపెద్ద బులియన్ మార్కెట్‌గా పేరున్న ఒక్క నరసాపురం మార్కెట్‌లోనే హోల్‌సేల్, రిటైల్ కలిపి రోజుకు రూ.4 కోట్లు వరకూ బంగారం అమ్మకాలు జరుగుతాయి. ఉమ్మడి పశ్చిమలోని ఏలూరు, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం పట్టణాల్లో పెద్దెత్తున అమ్మకాలు సాగుతాయి. పెరిగిన ధరలతో ఉమ్మడి పశ్చిమలో రోజుకు రూ.2 కోట్లుపైనే అమ్మకాలు తగ్గినట్టుగా అంచనా. దాదాపు 40 శాతం అమ్మకాలు తగ్గిపోయాయయని బులియన్ వర్తకులు చెబుతున్నారు.

కాసు రూ.లక్షకు చేరనుందా?

10 గ్రాముల బంగారం ధర రూ.లక్ష ఎప్పుడో దాటేసింది. సాధారణంగా వాడుకభాషలో జనం మాట్లాడుకుంటే 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర గురించి మాట్లాడుకుంటారు. కాసు బంగారం... ఇవాళ రేటెంతుందని అడుగుతారు. ప్రస్తుతం 22 క్యారెట్ల ఆభరణాల బంగారం కాసు(8గ్రాములు) ధర రూ.84,400గా ఉంది. మరికొన్ని రోజుల్లోనే కాసు ధర కాస్త రూ.లక్ష మార్కును చేరుతుందని భావిస్తున్నారు. అప్పుడు తరుగు, మజూరులతో కాసు బంగారు వస్తువు కొనాలంటే లక్షపైనే చూసుకోవాలి.

పాత బంగారం మార్పిడిపై ఆసక్తి

ధరలు దారుణంగా పెరగడంతో ఆభరణాల అమ్మకాలు పడిపోయాయి. పెళ్లిళ్ల వంటి సామాజిక అవసరాలకు బంగారం కొనేవారు కూడా వాయిదాలు వేసుకుంటున్నారు. పెట్టుబడిగా కొనే బిస్కెట్ అమ్మకాలు మాత్రం కాస్త బాగానే సాగుతున్నాయని చెబుతున్నారు. ఇక పాత బంగారం మార్పిడి జోష్ అన్ని పట్టణాల్లో కొనసాగుతోంది. ధరలు హైలో ఉండటంతో పాతబంగారం మార్పిడికి ఇదే అనుకూల సమయంగా కొనుగోలుదారులు భావిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న అమ్మకాల్లో 50 శాతం వాటా పాత బంగారం మార్పిడితోనే జరుగుతుందని చెబుతున్నారు.

అమ్మకాలు తగ్గాయి



బంగారం ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. చాలా నెలలుగా ధరలు పెరగడమే కానీ, తగ్గడం కనిపించలేదు. మధ్యలో ఒకరోజు స్వల్పంగా తగ్గినా, మర్నాడు మళ్లీ రెట్టింపు పెరుగుండడంతో బంగారం ధరలను అంచనా వేయలేకపోతున్నాం. ప్రస్తుతం అమ్మకాలు దాదాపు 40 శాతం తగ్గాయి. లిక్విడ్ క్యాష్‌తో ఎవరూ బంగారం కొనుగోళ్లు చేయడంలేదు. పాత బంగారం మార్చుకుని కొత్త వస్తువులు ఆర్డర్లు ఇస్తున్నారు. ప్రస్తుతం ఇదే వ్యాపారం ఎక్కువగా సాగుతోంది.

– వినోద్‌కుమార్‌జైన్, నరసాపురం బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

క్లుప్తంగా

అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్య పతకం


రంజని

ఏలూరు రూరల్: అథ్లెటిక్స్ పోటీల్లో ఏలూరు బాలిక ప్రతిభ చాటిందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఈ నెల 23 నుంచి 25 వరకు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో 18 ఏళ్ల వయసు విభాగంలో పాల్గొన్న జిల్లా అథ్లెట్ వి.రంజని మిడిల్ రిలే రన్నింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిందని వివరించారు. శాప్ కోచ్ గంట కృష్ణకుమారి వద్ద శిక్షణ పొందిన రంజని అందరిలో స్ఫూర్తి నింపిందని ఆమెను అభినందించారు.

వాగులోకి దూసుకెళ్లిన లారీ


శోభనాపురం వద్ద వాగులో ఉన్న లారీ

ఆగిరిపల్లి : అదుపుతప్పి కుంపిని వాగులోకి ఓ లారీ దూసుకెళ్లిన ఘటన శోభనాపురం వద్ద చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం కొండపల్లి నుంచి కంకర లోడుతో వస్తున్న లారీ శోభనాపురం కుంపిని వాగు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి కుంపిని వాగులోకి దూసుకుపోయింది. కుంపిని వాగు ఉధృతంగా ప్రవహిస్తూ ఉండడంతో లారీని బయటికి తీయడం సాధ్యపడడం లేదు. ఈ ఘటనలో లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

వైఎస్సార్ సీపీతో సామాజిక న్యాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సామాజిక న్యాయానికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2010లో కడప ఎంపీగా ఉన్నప్పుడే ఏబీసీడీ వర్గీకరణకు మద్దతు తెలియజేశారని గుర్తు చేశారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని, రిజర్వేషన్ ఫలాలు ఎస్సీల్లో ఉన్న 59 ఉప కులాలకు చివర కులాల వరకు రిజర్వేషన్ ఫలాలు అందాలన్న సదుద్దేశంతోనే శాసనసభ మండలిలో ఆమోదించిన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో మంత్రి మండలిలో కూడా సామాజిక న్యాయం చేశారని కొనియాడారు.

భూ వివాదంలో వ్యక్తిపై దాడి

ముదినేపల్లి రూరల్: భూమిలో వాటా పంచి ఇవ్వమని దౌర్జన్యానికి వచ్చి వ్యక్తిని గాయపరిచిన సంఘటన మండలంలోని పేరూరులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పుట్టి వీరనారాయణ కలిదిండి మండలం కొండూరుకు చెందిన తోలేటి చుక్కమ్మ సోదరి అవుతుంది. వీరనారాయణకు పేరూరులో కొంత భూమి ఉంది. దీనిలో కొంత భూమిని చుక్కమ్మకు ఇవ్వాలంటూ తోలేటి శ్రీనివాసరావు, సాయి, రేష్మా, పెంటయ్య, బి.మాసయ్య, టి సుబ్బారావు వీరనారాయణ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి గాయపరిచినట్లు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఎస్వీ రామారావు కేసు నమోదు చేశారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: మహిళను లైంగికంగా వేధిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై స్థానిక పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం మండలంలోని చేవూరుకి చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన రాకేష్ కొంతకాలంగా తన కోర్కెను తీర్చమని వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయాన్ని మహిళ తన భర్తతో పాటు అత్తమామలతో చెప్పగా వీరంతా కలిసి రాకేష్ ఇంటికి వెళ్లగా రాకేష్‌తో పాటు అక్కడే ఉన్న బి.పృథ్వీరాజ్ మహిళతో పాటు భర్త, అత్తమామలపై దాడి చేశారు. అనంతరం బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించింది.

యువకుడి అదృశ్యం


మడుగుల సురేష్

తణుకు అర్బన్: యువకుడు అదృశ్యమైన ఘటన పట్టణంలో సంచలనం సృష్టిస్తుంది. వివరాల ప్రకారం తాడేపల్లిగూడేనికి చెందిన మడుగుల సురేష్ (29) ఈనెల 23న తెల్లవారుజామున తణుకు వచ్చాడని ఆ రోజు నుంచి తన సోదరుడు కనిపించడం లేదని అతని సోదరి ముచ్చె ప్రశాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 25న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సురేష్ గతంలో తణుకు మునిసిపాలిటీ అవుట్ సోర్సింగ్‌లో పారిశుద్ధ్య నిర్వహణ పనుల్లో పని చేస్తూ రాష్ట్రపతి రోడ్డులోని సాయిబాబా గుడి వెనుక ప్రాంతంలో నివాసం ఉండేవారు. అయితే ఇటీవల తాడేపల్లిగూడెంలో పెయింటింగ్ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నట్లుగా తెలుస్తోంది.

అదృశ్యంపై అనుమానాలు

ఈ నెల 23వ తేదీన తనకు సన్నిహితంగా ఉండే స్నేహితురాలిని కలిసేందుకు తాడేపల్లిగూడెం నుంచి తణుకు వచ్చినట్లుగా సురేష్ కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఆ రోజు నుంచి కనిపించకపోవడంతో పాటు మొబైల్ కూడా స్విచ్ఛాఫ్ అవడంతో ఆ కుటుంబం ఆందోళనతో ఈనెల 25న తణుకు పట్టణ పోలీసులను ఆశ్రయించారు. అయితే ఈ ఘటనకు సంబంధించి తణుకులో ఒక న్యాయవాది కుటుంబంలో తలెత్తిన వివాదానికి, యువకుడి అదృశ్యానికి సంబంధం ఉన్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు న్యాయవాది కూడా పరారీలో ఉన్నారని పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నట్లుగా సమాచారం. ఐదు రోజులుగా సురేష్ కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.

కుల బహిష్కరణపై ఫిర్యాదు


బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు, అధికారులు


పెన్నాడ అగ్రహారం సచివాలయం వద్ద వినతి పత్రం ఇస్తున్న బాధితులు

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ అగ్రహారంలో తమ మాట వినడం లేదని కుల పెద్దలు సుమారు 28 మందిని కులం నుంచి వెలి వేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాలకోడేరు పోలీసులకు అందిన సమాచారం మేరకు గ్రామంలోని శెట్టిబలిజ పెద్దలు దొమ్మేటి వేణుగోపాలం, పంపన వెంకటేశ్వరరావు, పాల శేషు, గుత్తుల కొండలరావు, జక్కంశెట్టి బాలమురళీకృష్ణ, చింతపల్లి రామకృష్ణ తమ మాట వినడం లేదంటూ మూడేళ్ల క్రితం కొంత మందిని, ఏడాది క్రితం కొంత మందిని, ఏడు నెలల క్రితం మరో కొంత మందిని మొత్తం 28 మందిని కులం నుంచి వెలి వేశారు. ప్రేమ పెళ్లి విషయంలోనూ, స్థలం అమ్మకం విషయంలోనూ, డ్రెయినేజీ నిర్మాణ విషయంలోనూ ఇలా మమ్మల్ని బహిష్కరించినట్లు దొంగ నాగలక్ష్మి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, పి సురేష్, గుత్తుల నాగరాజు, జక్కంశెట్టి సత్య నాగరాజు, సిహెచ్ సుబ్రమణ్యం, చింతపల్లి శివప్రసాద్, గుత్తుల శ్రీనివాస్, చీరబోయిన శ్రీనివాసరావు, బొక్కా రమేష్, పంపన రవి మొత్తం 28 మందిని బహిష్కరించారు. అప్పటి నుంచి శుభ కార్యాలకు పిలవడం లేదు. అంతేగాక ఇళ్లకు వచ్చిన చుట్టాలను కూడా అవమానిస్తున్నారంటూ బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం భీమవరం రూరల్ సీఐ బి.శ్రీనివాస్, పాలకోడేరు ఎస్సై రవి వర్మ, పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరాజు, ఆర్ఐ రాఘవ రాజు, వీఆర్వో సుబ్రహ్మణ్యం తదితరులు స్థానిక పంచాయతీ కార్యాలయంలో బాధితులను విచారించారు. కాగా నిందితులు తాము గ్రామాంతరం వెళ్లామని చెప్పడంతో విచారణ రేపటికి వాయిదా వేశారు.

లక్కవరం చోరీ కేసు ఛేదన

- నలుగురు నిందితుల అరెస్ట్, ఒకరు పరారీ
- 246 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు ఎస్పీ కేపీ శివకిషోర్, జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలో ఇంటి తలుపులు పగులగొట్టి బెడ్‌రూమ్‌లో నిద్రిస్తోన్న భార్యభర్తను కొట్టి బీరువాలోని సుమారు 40కాసుల బంగారు ఆభరణాలు, 2కిలోల వెండిని దోచుకుపోయారు. ఈ చోరీ కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. నిందితులను అరెస్ట్ చేసిన, పోలీసులు చోరీ సొత్తును స్వాదీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ శుక్రవారం కేసు వివరాలను వెల్లడించారు. లక్కవరంలోని రామాలయం వీధిలో ప్రాంతానికి చెందిన వందనపు లక్ష్మీకుమారి తన భర్తతో కలిసి జీవిస్తోంది. ఈ నెల 23 తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు గది తలుపులు పగులగొట్టి బెడ్‌రూమ్‌లోకి ప్రవేశించి, భర్తను నోరు మూసివేసి, కర్రలతో కొట్టి బీరువాలోని సుమారు 40కాసుల బంగారు ఆభరణాలు, 2 కిలోల వెండి వస్తువులు దోచుకువెళ్లారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు.

పాత నేరస్తుడే సూత్రదారి

ఈ దర్యాప్తులో పాతనేరస్తుడి నిర్వాకం వెలుగులోకి వచ్చింది. లక్కవరం గ్రామానికి చెందిన దేవర శ్రీరామ్మూర్తి అనే వ్యక్తిపై కేడీ షీట్ ఉంది. పాతనేరస్తుడు కాగా వయసు రీత్యా తాను చోరీలకు పాల్పడకుండా తనకు తెలిసిన నేరగాళ్లతో చోరీలు చేయిస్తున్నాడు. బాపట్ల జిల్లా స్టువర్టుపురానికి చెందిన దొంగలను తీసుకువచ్చి చోరీలు చేయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. బాధితురాలు లక్ష్మీకుమారి ఇంటి పక్కనే నివాసం ఉంటోన్న బాజీ అనే వ్యక్తి ఆమె ఇంట్లో డబ్బు, బంగారం భారీగా ఉందని శ్రీరామ్మూర్తికి సమాచారం ఇచ్చాడు. దీంతో శ్రీరామ్మూర్తి బాపట్ల స్టువర్టుపురం నుంచి అంగడి విల్సన్ బాబు, గజ్జెల వాసు, కావేటి ప్రసాద్ అలియాస్ రమేష్ అలియాస్ చిన్న అనే ముగ్గురు దొంగలను లక్కవరం గ్రామానికి పిలిపించి చోరీ చేయించాడు. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేయగా కావేటి ప్రసాద్ అనే నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ నిందితులపై నల్లజర్ల, పెరవలి స్టేషన్లలోనూ కేసులు ఉన్నాయి. పాత నేరస్తుడు శ్రీరామ్మూర్తిపై ఏకంగా 14 కేసులు ఉండగా, విల్సన్‌బాబుపై ఆరు కేసులు, వాసుపై ఏడు కేసులు, పరారీలో ఉన్న ప్రసాద్‌పై 12కేసులు ఉన్నాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. నిందితుల నుంచి 246 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇనుప రాడ్డు, రెండు కర్రలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీ కేసును ఛేదించటంలో జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్, చింతలపూడి సీఐ క్రాంతికుమార్, ఫింగర్‌ప్రింట్స్ సీఐ పి.శ్రీనివాసరావు, జంగారెడ్డిగూడెం ఎస్సై ఎస్‌కే జబీర్, ఏఎస్సై సంపత్‌కుమార్‌తో సహా కానిస్టేబుల్స్‌ను జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


దామోదరరావు మృతదేహం

కైకలూరు: ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన పామర్రు–దిగమర్రు జాతీయ రహదారిలో ఆలపాడు ఆదర్శ పబ్లిక్ స్కూల్ ఎదుట శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరుకు చెందిన గొట్టుముక్కల నరసింహరాజు ఆకివీడు నుంచి కైకలూరు వస్తున్నాడు. మార్గమధ్యలో ఆలపాడు వద్ద ఓ మహిళకు ఆపితే బండి మీద తీసుకొస్తున్నాడు. గుడివాడ నుంచి ఆకివీడుకు ఉయ్యూరు మండలం బొల్లపాడుకు చెందిన లారీ డ్రైవర్ కుందేరు దామోదరరావు, గుడివాడ మండలం శ్రీ చింతల గ్రామానికి చెందిన పిళ్ళం జోజిబాబు, గుడివాడ బాలకృష్ణానగర్‌కు చెందిన సమ్మెట సుబ్బరాజులు ఒకే వాహనంపై వస్తున్నారు. సుబ్బరాజు వాహనం నడుపుతోన్నాడు. ఆకివీడులో లారీ లోడు నిమిత్తం వీరు ముగ్గురు వెళ్తున్నారు. వీరి రెండు వాహనాలు ఎదురెదుగా ఢీకొనడంతో దామోదరరావు(50)కి తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై గొట్టుముక్కల నరసింహరాజు ఫిర్యాదు మేరకు రూరల్ ఏఎస్సై జి.విజయబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా ద్విచక్ర వాహనాల చోరీలు

నూజివీడు: నూజివీడు పట్టణం ద్విచక్ర వాహనాల దొంగతనాలకు కేంద్రంగా మారింది. రెండు నెలల కాలంలోనే పట్టణంలో 20 వరకు ద్విచక్ర వాహనాలను దొంగలు ఎత్తుకెళ్లారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నాలుగు రోజుల క్రితం అమ్మవారితోట ప్రాంతంలో భార్యాభర్తల ద్విచక్ర వాహనాలను దొంగలు రాత్రి సమయంలో ఎత్తుకెళ్లారు. ఈ నెల 21న రాత్రి సమయంలో అమ్మవారితోట ప్రాంతంలో నాయుడు మధులత ద్విచక్ర వాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లగా తిరిగి మళ్లీ ఈనెల 24న రాత్రి దొంగలు మధులత భర్త ప్రసాద్ ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకుపోయారు. దీంతో వీరిద్దరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అమ్మవారితోటలోనే నెలరోజుల్లో 5 బైక్‌లు దొంగతనానికి గురయ్యాయి. పట్టణంలో ఇప్పటిదాకా 20 బైక్‌ల వరకు చోరీకి గురవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని చాలా మంది తమ ఇళ్లు చిన్నవిగా ఉండడం, గేటు లోపల ఖాళీ స్థలం ఉండకపోవడంతో గేటు బయట రోడ్డు మార్జిన్‌లోనే ఉంచి తాళం వేస్తున్నారు. దీనినే ఆసరాగా చేసుకుని దొంగలు బైక్‌లను ఎత్తుకెళ్తున్నారు. తాము పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు ఇస్తున్నా దర్యాప్తులో పురోగతి ఉండటం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హరిత హోటల్ ప్రైవేటీకరణ అంశంపై చర్చ

సాక్షి స్పందన


శ్రీవారి కొండపైన హరిత హోటల్

ద్వారకాతిరుమల: రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పరిధిలోని హరిత హోటల్స్, రిసార్ట్‌ను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు టెండర్ ప్రక్రియను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే శ్రీవారి దేవస్థానం గతంలో కొండపైన కోట్లాది రూపాయలు విలువైన భూమిని పర్యాటక అభివృద్ధి సంస్థకు నామమాత్రపు ధరకు విక్రయించగా, అందులో హోటల్ నిర్మించారు. దాన్ని సక్రమంగా నడపలేక గతంలో ఒకసారి ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నించారు. అప్పట్లో దేవస్థానం అధికారులు దాన్ని అడ్డుకున్నారు. మళ్లీ ఇప్పుడు ప్రైవేటీకరణ అంశం తెరమీదకు వచ్చింది. ఈ నేపథ్యంలో ఈనెల 19న సాక్షిలో ‘టెంపుల్ జాగా.. ప్రైవేట్ పరం దిశగా’ శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై దేవస్థానం ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్‌వీఎస్ఎన్ నివృతరావులు స్పందించారు. ఈ క్రమంలో టూరిజానికి సంబంధించిన ఫైల్‌ను పరిశీలించిన ఈఓ, ఈనెల 21న శ్రీవారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఇచ్చే సమయంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో ఈ అంశంపై చర్చించడంతో ఆయన ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఏది ఏమైనా కొండపైన భూమి ప్రైవేట్ వ్యక్తుల పరం కావడం మంచిది కాదని, అది క్షేత్ర పవిత్రతకు, భద్రతకు ముప్పని శ్రీవారి భక్తులు అంటున్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం


సత్యనారాయణకు దరఖాస్తులను అందిస్తున్న వినియోగదారులు

ఉంగుటూరు: విద్యుత్ వినియోగదారుల ఫోరమ్ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని విద్యుత్ వినియోగదారుల ఫోరమ్ అధ్యక్షుడు డాక్టర్ బి.సత్యనారాయణ వెల్లడించారు. శుక్రవారం నారాయణపురం సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటివరకు 939 సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు రాగా 746 సమస్యలను పూర్తిగా పరిష్కరించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్.రాజబాబు, ఎస్.సుబ్బారావు, ఎం. మురళీ క్రిష్ణ, ఏఈ కేఎం అంబేత్కర్, డిప్యూటీ ఏఈ రాళ్ల పల్లి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు


భారీ విద్యుత్ కటౌట్‌ను నిర్మిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలకు క్షేత్రంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. వచ్చే నెల 2 నుంచి 9 వరకు జరగనున్న ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే ఆలయంలో ధ్వజస్తంభం వద్ద చలువ పందిరిని నిర్మించారు. శుక్రవారం గుడి సెంటర్‌లో 40 అడుగుల స్వామివారి భారీ విద్యుత్ కటౌట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అలాగే ఆలయ రాజగోపురాలకు, ఆళ్వార్‌ల మండపాలకు, పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. అలాగే క్షేత్రంలో పలు చోట్ల రంగులు వేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీల్లో విజేతలు వీరే

భీమవరం: జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీలకు విశేషస్పందన లభించిందని సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గాంధీతత్వం–నేటి భారతం అనే అంశంపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాస్థాయిలో కళాశాల, పాఠశాల విద్యార్థులకు పోటీలను నిర్వహించామని పేర్కొన్నారు. విజేతలకు అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా పెదనిండ్రకొలనులోని గాంధీభవనంలో బహుమతుల అందిస్తామని ప్రసాదరాజు వివరించారు.

విజేతలు వీరే

పాఠశాల స్థాయి సబ్ జూనియర్ విభాగంలో పి.లీలాఅశ్వ (దర్శిపర్రు), వీఎస్ చక్రధర్ (యలమంచిలి), ఏవీఎస్ స్వాగత్ (నందమూరుగరువు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా హేమశ్రీ(శోభనాపురం) కన్సోలేషన్ బహుమతి గెల్చుకుంది. అలాగే జూనియర్ విభాగంలో పి.ఆనందిత (పెదనిండ్రకొలను), సీహెచ్ దీవెన (పత్తేపురం), ఎం.ఝాన్సీదేవి (భీమవరం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా బుంగ హర్షిత (ఆకివీడు) కన్సోలేషన్ బహుమతి గెల్చుకుంది. సీనియర్స్ విభాగంలో సి.జోషిక (భీమవరం), ఎ.కావ్యశ్రావణి (తాడేపల్లిగూడెం), ఎస్ఎన్‌వీఎస్ బ్రాహ్మిణి (గోపాలపురం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లోను, ఆర్.గౌరీనాగశ్రీ (కోపల్లె) కన్సోలేషన్ గెల్చుకుంది. కళాశాల స్థాయిలో పి.సాత్విక (పెద అమిరం), ఎస్ఎన్ శ్రీవర్ష (భీమవరం), డి.వెంకటలక్ష్మి (ఏఎస్ నగర్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని ప్రసాదరాజు చెప్పారు.

పేదల విద్యకు ఏదీ ప్రాధాన్యం?

- పేరుకున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- ఫీజులు చెల్లించకపోతే ధ్రువపత్రాలు ఇవ్వనంటున్న యాజమాన్యాలు
- నిలిచిపోయిన నాటి వసతి దీవెన


తణుకులో జగన్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైన మహిళలు (ఫైల్)

తణుకు అర్బన్: ప్రభుత్వ విధానాలతో పేదల విద్య అతలాకుతలమైపోయి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎటువంటి నొప్పి తెలియకుండానే చదువులు గట్టెక్కగా నేడు దినదిన గండంగా మారిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఒకవైపు కళాశాలలకు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లింపులు బకాయిలు పడడంతో కొన్ని యాజమాన్యాలు ఫీజులు కట్టమని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని చెబుతున్నారు. గత విద్యాసంవత్సరంలో ఇంజనీరింగ్ విద్యాభ్యాసం పూర్తయినా ఫీజుల బకాయిలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతున్నారని కొందరు తల్లిదండ్రులు చేసేదిలేక ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తెచ్చుకున్నామని వాపోతున్నారు. కొన్ని కళాశాలల్లో ఫీజులు కడితేనే హాల్ టికెట్‌లు ఇస్తామని అప్పుడు మాత్రమే పరీక్షలు రాయగలరని యాజమాన్యాల ఒత్తిడితో ఫీజులు చెల్లించామని తల్లితండ్రులు గగ్గోలు పెడుతున్నారు. ఫీజులు కట్టలేని పేదవర్గాలకు చెందినవారు సర్టిఫికెట్లు ఎప్పుడిస్తారా అని ఎదురుచూపులు చూడాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిపోయిన వసతిదీవెన..

కళాశాలలు, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏడాదికి రూ. 20వేలు చొప్పున జగన్ ప్రభుత్వంలో వసతి దీవెన పేరుతో ఇవ్వగా నేడు ఆ పథకాన్ని పూర్తిగా నిలిపివేశారు. హాస్టల్ ఖర్చులకుగాను తల్లిదండ్రులకు ఆర్థికంగా అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన పథకం గత ఐదేళ్లు తల్లిదండ్రులకు ఎంతో బాసటగా నిలిచింది. ఆ డబ్బులతో ఇంజనీరింగ్ విద్యార్థుల ఖర్చులకు, రవాణా నిమిత్తం తల్లిదండ్రులు వినియోగించేవారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ పథకం నిలిపివేయడంతో ఇంజనీరింగ్ విద్యార్థులు తమ బస్సుల ఫీజులు, ఇతర ఖర్చులకు తల్లితండ్రుల నుంచి తీసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఫీజులు కడితేనే పరీక్షలు రాయించారు



పేద, దిగువ మధ్య తరగతి వర్గాల పిల్లల విద్యకు నేడు తీవ్రమైన ఆటంకాలు ఎదురవుతున్నాయి. గత ఐదేళ్లు ఎటువంటి ఒడిదుడుకులు లేని విద్య, కూటమి ప్రభుత్వం రాగానే తల్లితండ్రులకు భారంగామారింది. నా మేనకోడలు ఇంజనీరింగ్ పూర్తిచేసుకుని ధృవపత్రాల కోసం తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్తే సుమారుగా రూ. 1లక్ష బకాయి కట్టించుకుని ధృవపత్రాలు అందజేశారు. మా అబ్బాయి 4వ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యలో ఫీజు బకాయి కడితేనే కానీ పరీక్ష రాయనివ్వమని రాజాంలోని జీఎంఆర్ కళాశాల యాజమాన్యం చెప్పడంతో రూ. 78వేలు చెల్లించాల్సి వచ్చింది. ప్రభుత్వం నుంచి డబ్బులు అందితే మీ బ్యాంక్ ఖాతాకు వేస్తామని ఆయా యాజమాన్యాలు చెప్పారు. అది నేటి ప్రభుత్వంలో తల్లిదండ్రుల దుస్థితి. – జల్లూరి జగదీష్, తణుకు

వసతి దీవెన తీసేశారు



గత జగన్ ప్రభుత్వ హయాంలో తెలుపు రంగు రేషన్ కార్డు ఉన్న కళాశాల విద్యార్థులకు వసతి దీవెన పథకంలో భాగంగా ఏడాదికి రూ. 20వేలు తల్లుల బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం జమచేసేది. ఇది డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థుల హాస్టల్, రవాణా ఇతర ఖర్చులకు ఈ పథకం తల్లిదండ్రులకు అండగా ఉండేది. కానీ కూటమి ప్రభుత్వం రాగానే ఈ పథకాన్ని తీసేయడంతో నేడు ఇంజనీరింగ్ విద్యార్థుల తల్లిదండ్రులు ఆ మొత్తాన్ని ఖర్చుచేసుకోవాల్సి వస్తుంది. గతంలో ఈ ఖర్చులకు ఏ నొప్పి తెలియకపోగా నేడు ఆ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. పేదల విద్యకు ఉపయోపడే పథకాలను తొలగింపచేయడం దారుణం. – వీరమల్లు ఫణీంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు

క్లుప్తంగా

మహాకవి చిలకమర్తి


తణుకులో సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో చంద్రశేఖర్‌ను సత్కరించిన దృశ్యం

తణుకు అర్బన్: కవి, దేశభక్తుడు చిలకమర్తి లక్ష్మీ నరసింహం జయంతి సందర్భంగా సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. స్థానిక ఎస్ఎం నర్సింగ్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ భావస్వేచ్ఛకు ఎంతో ప్రాధాన్యత ఉందని, తెలుగుతనం మూర్తీభవించిన మహా కవి చిలకమర్తి అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ గుంటూరి వెంకట చంద్రశేఖర్, రిటైర్డు ఎస్‌టీపీసీ డిప్యూటీ మేనేజరు మందరపు సాయిబాబులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేలపాటి చంటి, గేటేటి మారుతీగోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రజక జాతి వీర నారి ఐలమ్మ


ఐలమ్మ జయంతిని నిర్వహిస్తున్న రజక సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భూమి కోసం, భుక్తి కోసం బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం రజక జాతి వీర నారి చిట్యాల ఐలమ్మ ఎన్నో పోరాటాలు చేశారని, రజక జాతి ఐక్యతగా హక్కుల కోసం పోరాడాలని నవ్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రజక వృత్తిదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అద్దాల నరసింహరావు, రజక చైతన్య సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నాడ శ్రీనివాస్‌లు కోరారు. పట్టణంలో ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం రజక సంఘం నేతలు నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ రజకులకు ప్రభుత్వాలు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు యండమూరి మహేష్, టి.పల్లారావు, అవిడి సత్యనారాయణ, లక్ష్మి, అమ్మోరు, వి.శ్రీనివాస్, పి.అన్నవరంలు పాల్గొన్నారు.

శశిలో అంతర్జాతీయ సదస్సు


శశి ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

తాడేపల్లిగూడెం: స్థానిక శశి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ సదస్సు జరిగింది. ప్రపంచంలో వేగంగా మారుతున్న సాంకేతికతలను గురించి విదేశాల నుంచి వచ్చిన వక్తలు పేర్కొన్నారు. ఆధునిక సమాజంలో ఎదుర్కొంటున్న పర్యావరణ, సామాజిక సమస్యలకు సుస్థిర సాంకేతిక పరిజ్ఞానాలు పరిశోధనా ఆవిష్కరణలు కీలకమని శశి సంస్థల పాలకవర్గ వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ అన్నారు. మలేషియా, సైట్ హెల్ప్ యూనివర్సిటీల మధ్య ఎంఓయు జరిగింది. మలేషియా, యుఏఇ, ఆంధ్రాయూనివర్సిటీ, విట్ అమరావతి, నిట్ తిరుచ్చిలకు చెందిన బిన్ రియాజ్, షరీఫ్, పలనియప్పన్, అల్ దబ్బాని, వజీర్ అహ్మద్, మొబాంటీ, వినయరాజ్‌లు హాజరయ్యారు. సదస్సులో సమర్పించిన పత్రాలు స్ప్రింగర్ నేచర్ పబ్లికేషన్ భాగస్వామ్యంతో ప్రచురించనున్నారు.

మెప్మా కార్యాలయంలో లోక కళ్యాణ్ మేళా

పాలకొల్లు సెంట్రల్: కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం స్వానిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి వీధి విక్రయదారులు (చిరు వ్యాపారులు)కు సూచించారు. శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మెప్మా భవనంలో లోక కళ్యాణ్ మేళా పీఎం స్వానిధి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయసారథి మాట్లాడుతూ వీధి విక్రయదారులకు ఈ పథకం ద్వారా గతంలో రూ.10 వేలు అప్పు ఇచ్చేవారని, ప్రస్తుతం మరో రూ.5 వేలు పెంచి రూ.15 వేలు ఇస్తున్నారని తెలిపారు. రెండో విడతలో రూ.20 వేలు ఇచ్చేవారని ప్రస్తుతం దానికి మరో రూ.5 వేలు పెంచి రూ.25 వేలు అప్పుగా ఇస్తున్నారని చెపాపరు. వివిధ బ్యాంకుల మేనేజర్లు మాట్లాడుతూ బ్యాంక్‌ల ద్వారా అమలు చేస్తున్న ఇన్సూరెన్స్ పథకాలు వినియోగించుకుని తమ కుటుంబాలకు భద్రత కల్పించుకోవాలని సూచించారు. క్యూఆర్ కోడ్‌తో స్కానర్లను ఉపయోగించుకుని లావాదేవీలు నిర్వహిస్తే భద్రత ఉంటుందన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ చెప్పారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామన్నారు.

డిజిటల్ బుక్ ప్రతి కార్యకర్తకూ కొండంత అండ


సమావేశంలో మాట్లాడుతున్న మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ

అత్తిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్, వేధింపులకు గురైన ప్రతి కార్యకర్తకు కొండంత అండ అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. శుక్రవారం అత్తిలి మండల కార్యాలయంలో శుక్రవారం మండల నాయకులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను ఉద్దేశ్యపూర్వకంగా వేధింపులకు గురిచేస్తే తక్షణమే డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని, తద్వారా వారిని చట్టం ముందు దోషులుగా నిలబెట్టే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బుద్దరాతి భరణీ ప్రసాద్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, రంభ సూరిబాబు, అనిశెట్టి త్రిమూర్తులు, వేగేశ్న ధనసత్యనారాయణరాజు, కోరుకొల్లు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు సరికాదు


మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజా సేవకుడిగా...ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ అసెంబ్లీ వేదికగా సంస్కార హీనంగా మాట్లాడటాన్ని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు శుక్రవారం తీవ్రంగా ఖండించారు. సినీనటుడిగా తాను నటించిన సినిమాల్లో హిత బోధలు చేస్తూ గొప్పలు చెప్పుకొనే వ్యక్తి నిజ జీవితంలో అసెంబ్లీ వేదికగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడాన్ని తప్పుపట్టారు. ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్లూ సినీ పరిశ్రమకు అండగానే ఉన్నారని గుర్తు చేశారు. బాలకృష్ణ వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమావేశంలో నాయకులు సీతారామ్, ఎం.శ్రీనివాస్, కె.రత్నరాజులు పాల్గొన్నారు.

బ్రాందీ షాపు సీజ్



గూడెంలో సీజ్ చేసిన బ్రాందీ షాపు

తాడేపల్లిగూడెం: ఎంఆర్పీ కంటే అధిక ధరకు మద్యం విక్రయిస్తున్న కారణంగా పట్టణంలోని కేఎన్‌రోడ్ రిలయన్స్ సమీపంలో ఉన్న శక్తి వైన్స్‌కు ప్రత్యేక బృందం శుక్రవారం సీజ్ చేశారు. ఇంతకు ముందు కూడా రెండు దుకాణాలను సీజ్ చేశారు. దుకాణాల యజమానుల వివరణ అనంతరం, అపరాధ రుసుం చెల్లించాక తిరిగి రెండు దుకాణాలను తెరుచుకొనేందుకు అనుమతి ఇచ్చారు. స్పెషల్ స్క్వాడ్ వెంట స్థానిక ఎక్సైజ్ పోలీసులు ఉన్నారు.

జగన్మాతా నమోస్తుతే

తణుకు అర్బన్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శుక్రవారం ఘనంగా కొనసాగాయి. వాడవాడలా అమ్మవారు విభిన్న రూపాలలో సాక్షాత్కరించి పూజలందుకున్నారు. భక్తజనంతో ఆలయాలు కిటకిటలాడాయి. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ప్రార్థనా మందిరంలో వాసవీమాతను శ్రీ మహాలక్ష్మీ దేవిగా సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించి భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు. శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ తమిరి శ్రీనివాస్ దంపతులు, స్వర్ణకార సంఘ పట్టణ అధ్యక్షుడు నాగుమల్లి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి కోరుమిల్లి సుబ్బారావు, బొల్లోజు మల్లికార్జునరావు, పాడుగు సత్యనారాయణ, తమిరి శివ, నాగుమల్లి గణేష్ భవాని పాల్గొన్నారు. తణుకు జాతీయ రహదారి సమీపంలోని శ్రీ చక్రసహిత నాగదుర్గాదేవి ఆలయంలో నాగమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమ్మ తల్లిని సుందరంగా అలంకరించారు. అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తి శ్రద్ధలతో దేవీ నవరాత్రి మహోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో దేవి నవరాత్రి మహోత్సవాలు శుక్రవారం ఐదో రోజు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారిని శ్రీ అన్నపూర్ణాదేవిగా విశేష అలంకరణ చేశారు. ఆలయం ఆవరణలో శ్రీ మహాలక్ష్మి సౌభాగ్య సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. శ్రీ వాసవికన్యక పరమేశ్వరీ ఆలయం అమ్మవారిని శ్రీ ధనలక్ష్మిదేవిగా విశేష అలంకరణ గావించారు. ఆలయం లోపల రూ.కోటిన్నర కరెన్సీ నోట్లుతో అలంకరణ జరిగింది. స్థానిక శంకరమఠంలో సర్వమంగళా అమ్మవారిని శ్రీ మహాలక్ష్మిదేవిగా విశేష అలంకరణ గావించారు. జువ్వలపాలెంలోని ఆర్యవైశ్య యువజన సంఘం వారిచే శ్రీ లలితాదేవి ఆలయంలో అమ్మవారిని రజిత కవచాలంకృత లలితాదేవిగా విశేషంగా అలంకరించారు. శ్రీదేవి మహంకాళమ్మ తల్లి ఆలయంలోని అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా విశేష అలంకరణ గావించారు.


తణుకు అర్బన్: మహాలక్ష్మిదేవి అలంకరణలో కామాక్షి అమ్మవారు


తాడేపల్లిగూడెం(టీటీసీ): లలితాదేవి అమ్మవారు


తాడేపల్లిగూడెం అర్బన్: కోటిపల్లి సెంటర్ సాయిబాబా ఆలయం వద్ద మహాలక్ష్మి అమ్మవారు


పెంటపాడు: మునినాని వారి వీధిలో రూ. 70 వేలతో కరెన్సీతో అమ్మవారికి అలంకరణ


అత్తిలి: ఆరవల్లిలో శ్రీమహాలక్ష్మి అలంకరణలో కనకదుర్గమ్మ

వాడవాడలా విశేష పూజలు

పెంటపాడు: మండలంలో దసరా మహోత్సవాలు సందర్భంగా శుక్రవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెంటపాడు మునినాని వారి వీధిలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ అమ్మవారిని రూ. 70 వేల కరెన్సీతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి తదితరులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్తిపాడు వై. జంక్షన్‌లోని దుర్గమ్మ ఆలయంలో సాయంత్రం భజన కాలక్షేపం నిర్వహించారు. ఈవో యాళ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కె.పెంటపాడు బైరాగిమఠంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి అర్చకులు త్రిలోచన దాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. దర్శిపర్రు పార్వతిబ్రహ్మ లింగేశ్వరస్వామివారి ఆలయంతో పాటు, పలు గ్రామాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

ముత్యాలమ్మ వారికి మహాలక్ష్మీ అలంకరణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారిని శుక్రవారం మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి గర్భాలయాన్ని రూ.12లక్షలు విలువైన నగదుతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అమ్మవారికి అన్నంనేడి భవానీరాజు దంపతులు లక్ష కుంకుమార్చన, మాదిరెడ్డి మురళీకృష్ణ దంపతులు చండీపారాయణ, చండీ హోమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి. హరేరాం ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వీరంపాలెం బాలాత్రిపుర సుందరీ అమ్మవారిని స్కంద మాతగా అలంకరించి పూజలందించారు. విశ్వేశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి మాట్లాడుతూ సంతాన ప్రదాతగా స్కంధ మాతను పూజిస్తారన్నారు. పీఠం ప్రతినిధులు గరిమెళ్ళ కృష్ణ సందీప్, ఈమని శశికుమార్ శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలమ్మ వారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించిన దృశ్యం

విశేష అలంకరణలు

అత్తిలి: దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో కనకదుర్గమ్మ శుక్రవారం శ్రీమహాలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామానికి చెందిన కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, రామలక్ష్మి దంపతులచే అమ్మవారిని అలంకరించి, ప్రసాదాన్ని నివేదించారు. భక్తులు ఆధ్వర్యంలో చండీహోమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కేల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు


ధాన్యం కొనుగోలు సమాచార కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: రైతు సేవా కేంద్రాల్లో అక్టోబరు 10వ తేదిలోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని మాధవరం కమ్యూనిటీ హాల్‌లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని గరిష్ఠ ప్రయోజనం పొందాలన్నారు. రైతులు దళారులు, మధ్యవర్తుల చేతిలో నష్టపోకుండా ఎటువంటి మోసాలకు తావు లేకుండా ఆర్‌ఎస్‌కేల్లో మాత్రమే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. రైతులకు ధాన్యం తేమ శాతంలో ఎదురవుతున్న సమస్యలను జేసీ దృష్టికి తీసుకురాగా, తేమ శాతం, బరువు, నాణ్యత వంటి అంశంపై ఆర్‌ఎస్‌కేలు వద్ద నిర్ధారించిన తేమ శాతం మాత్రమే పరిగణలోకి తీసుకోబడుతుందన్నారు. ధాన్యం కొనుగోలు నిమిత్తం సరఫరా చేసే గోనె సంచుల నాణ్యతను ముందుగా చూసుకొని రైతులు తీసుకెళ్లాలన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు సమాచార కరపత్రాన్ని జేసీ రాహుల్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో, జిల్లా వ్యవసాయాధికారి జడ్. వెంకటేశ్వరరావు, సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, కృషి అమృత్ భారత్ చైర్మన్ నగేష్, రెవెన్యూ, వ్యవసాయ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పీఎం స్వానిధి రుణాల దరఖాస్తుల స్వీకరణ


తణుకులో పీఎం స్వానిధి రుణాల దరఖాస్తుల సేకరణ కార్యక్రమంలో అధికారులు

తణుకు అర్బన్: తణుకు పురపాలక సంఘం మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం లోక కల్యాణ మేళాను స్థానిక వీకే కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించినట్లు మునిసిపల్ మెప్మా సిటీ మిషన్ మేనేజరు శ్రీనివాస్ తెలిపారు. అర్హత కలిగిన వీధి విక్రయదారుల నుంచి పీఎం స్వానిధి మొదటి, రెండవ, మూడవ విడతలకు సంబంధించి దరఖాస్తులను తీసుకున్నట్లుగా చెప్పారు. మొదటి విడతలో రూ. 15వేలు, రెండవ విడతలో రూ. 25వేలు, మూడవ విడతలో రూ. 50వేలు రుణాలు మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు. 300పైగా లబ్ధిదారులు కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. ముందుగా హెల్త్ క్యాంపు నిర్వహించి, డిజిటల్ క్రయ విక్రయాలు ఏవిధంగా చేయాలనే అంశాలపై అవగాహన కల్పించినట్లుగా చెప్పారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ హెప్సిబ, లైవ్‌లీ హుడ్ స్పెషలిస్ట్ నానిబాబు, బీహెచ్ శ్రీనివాస్, బ్యాంక్ మేనేజర్లు, టీడీపీ నాయకులు కలగర వెంకటకృష్ణ, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, మెప్మా సీవోలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


ఇరగవరంలో వైద్య శిబిరం పాల్గొన్న వైద్య సిబ్బంది, నాయకులు

ఇరగవరం: మండలంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను మహిళలు వినియోగించుకోవాలని ఇరగవరం పీహెచ్‌సీ వైద్యులు డా.మౌనిక తెలిపారు. మండలంలోని ఇరగవరం గ్రామంలో శుక్రవారం 110మంది రోగులను పరీక్షించి వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు వై మౌనికా మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సహకార సంఘం అధ్యక్షుడు వేండ్ర నాగరాజేశ్వరరావు, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, సీహెచ్‌వో ఎస్‌కె ఖాన్ సాహెబ్, నాయకులు శీలబోయిన శ్రీనివాస్, చవ్వకుల సత్యనారాయణ, కడలి పైలారావు, మెరిపే రాజేష్, వేండ్ర పోతురాజు, వేండ్ర నాగు, తానేటి సుబ్రమణ్యం, ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడి సిబ్బంది, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్లు పేదలకు ఇవ్వాలి

పెనుగొండ: ప్రభుత్వ పోరంబోకు, మురుగు, పంట కాల్వల గట్లు వెంబడి ఉన్న కొబ్బరి చెట్ల ఫల సాయం పేదలకు స్వాధీనం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాతిరెడ్డి జార్జ్ అన్నారు. శుక్రవారం పెనుగొండ గ్రామ పంచాయతీ వద్ద జరిగిన మహాసభలో మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు పనులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి జీవనోపాధి కోసం ప్రభుత్వ భూముల్లో ఉన్న కొబ్బరి చెట్లను వారికి స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి షేక్ పాదుషా మూడేళ్ల కార్యక్రమాలు నివేదిక ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులుగా పూతినీడి పద్మ, ఉపాధ్యక్షుడిగా మామిడి శెట్టి ఏడుకొండలు, కార్యదర్శిగా కుడుపూడి ప్రసాదు, సహాయ కార్యదర్శిగా షేక్ పాదుషా, కమిటీ సభ్యులుగా కేవీవీ సత్యనారాయణ, కె.నరసింహమూర్తి, కె.నారాయణ, ఏడుగురితో పెనుగొండ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, మహిళా సంఘం నాయకురాలు జక్కంశెట్టి వెంకటలక్ష్మి, మాదాసు నాగేశ్వరరావు, శీలం ఏసు పాల్గొన్నారు.

పీ-4పై సిబ్బందికి శిక్షణ

పెనుగొండ: ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి పీ-4 సర్వేపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ నెల 30లోపు బంగారు కుటుంబాల పూర్తి సమాచారాన్ని తెలుసుకోవాలని ఎంపీడీఓ బి.కృష్ణమోహన్ అన్నారు.